


ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేస్తున్నాం

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వల్లనే ప్రైవేటు ధరల్లో నిలకడ
- కాటా వేశాక ధాన్యం తడిస్తే మాదే బాధ్యత
- సివిల్ సప్లయీస్ జీఎం గంటా శ్రీలత



ఇంటర్వ్యూ...

ఖమ్మం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పరంగా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయని, మొత్తం 325 కేంద్రాలు ఏర్పాటు చేశామని సివిల్ సప్లయీస్ జీఎం గంటా శ్రీలత తెలిపారు. ఈ సారి 4.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 3600మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్లే ప్రైవేటు మార్కెట్‌లో ధర స్థిరంగా ఉందని అన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఆమె గురువారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు..

ప్రశ్న: ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం ఎంత..? ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు?

జవాబు: జిల్లాలో 4.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రెండున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అమ్మకానికి వచ్చే అవకాశం ఉంది. రైతులు తెచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉంది. జిల్లాలో 325 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశాం.

ప్ర: ధాన్యం కొనుగోళ్లు వేగం పుంజుకోకపోవడానికి కారణం ఏంటి?

జ: జిల్లాలో ఈ సారి వరిసాగు కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. అనేక చోట్ల కోతలు ప్రారంభం కాకపోవడంతో కొన్ని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం లేదు. ఈ నెల చివరి వారంలో ఎక్కువ ధాన్యం వస్తుంది. ఇప్పటి వరకు 3600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం.

ప్ర: ఇటీవల రాత్రివేళ అకాలవర్షాలు పడుతున్నాయి. కేంద్రాల వద్ద ధాన్యం తడిస్తే నష్టాన్ని ఎవరు భరించాలి?

జ: కొనుగోలు కేంద్రాల వల్ల రైతుల ధాన్యం కాంటా వేస్తే ఆ నష్టం మా సంస్థ భరిస్తుంది. కాంటా వేయకపోతే రైతులే భరించాలి. అందువల్ల ప్రతి కల్లం వద్ద కొన్ని టార్పాలిన్స్ అందుబాటులో (మిగతా 6వ పేజీలో)

బాల్యం అపురూపమైనది..

- పిల్లలు సంపూర్ణంగా ఆస్వాదించాలి
- కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- ప్రతిభావంతులకు అండగా నిలబడతాం
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- బాలసదనంలో ఘనంగా బాలల దినోత్సవం



బాలల సదనం చిన్నారులతో కలెక్టర్

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పిల్లలు తమ బాల్యాన్ని సంపూర్ణంగా ఆస్వాదిస్తూ, లక్ష్యం నిర్దేశించుకొని కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని బాల సదనంలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పిల్లలతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, అభినందించి ప్రత్యేక బహుమతులను అందజేశారు. కాగా, ఒక కుటుంబ సభ్యుడిలా, బంధువులా తమకు తీపి జ్ఞాపకాలను అందిస్తున్న కలెక్టర్‌కు జీవితాంతం కృతజ్ఞతగా ఉంటామని ఈ సందర్భంగా పిల్లలు తెలిపారు. పిల్లలందరూ వారి అనుభూతులను వ్యాస రూపంగా రాసిన లెటర్లను అల్బమ్‌గా తయారు చేసి కలెక్టర్‌కు అందించగా, ఇది తనకు గొప్ప బహుమతి అని కలెక్టర్ పిల్లలను ప్రశంసించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవ జీవితంలో బాల్యం అపురూపమైనదని, ప్రస్తుత పిల్లల ఆలోచన తీరు చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉంటోందని అన్నారు. ప్రపంచంలో కొత్త కొత్త ఆలోచనలు పిల్లల నుంచే వస్తున్నాయని తెలిపారు. పిల్లలు మంచి ఆహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, పెద్దల మాటలు వినాలని అన్నారు. ప్రతిరోజు కొంత సమయం ఆడుకోవాలని, పాఠశాలలో చెప్పిన పాఠాలు ఒకసారి పునరావృతం చేసుకోవాలని అన్నారు.

ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న వారు తరువాత ఏ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చదివేందుకు సీటు సాధించాలో లక్ష్యం నిర్దేశించుకుని చదవాలని సూచించారు. పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధిస్తే ఉత్తమ కళాశాలలో చదివేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం తరఫున చేస్తామని తెలిపారు. బాల సదనంలోని పిల్లలకు వైజాగ్ టూర్ ఏర్పాటు చేస్తామని, దీనికి సంబంధించి ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. బాలల దినోత్సవం నేపథ్యంలో పిల్లలను అమరన్ సినిమాకు తీసుకుని వెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్ రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారి విష్ణువందన, బాల సదనం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అండర్-14 అథ్లెటిక్స్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్- 14 బాలుర, బాలికల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహ మూర్తి తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి 10 జిల్లాలనుంచి సుమారు 360మంది క్రీడాకారులు, 40మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరవుతారని తెలిపారు. పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి ఏర్పాట్లను కల్పించినట్టు తెలిపారు.



ముస్తాబైన కూసుమంచి శివాలయం

కార్తీక పౌర్ణమికి వేళాయే...

ఆధ్యాత్మికత గుబాళిస్తోంది.. ఆలయాలు నూతన శోభతో అలరారుతున్నాయి.. ఎటు చూసినా పండుగ సందడే కనిపిస్తోంది. శుక్రవారం కార్తీక పౌర్ణమిని భక్తి ప్రపత్తులతో జరుపుకునేందుకు అందరూ సిద్ధమయ్యారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు వత్తులు కాల్చి, నూనె దీపాలను వెలిగించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మట్టి ప్రమిదలు, నూలు వత్తులు, నూనెలు, ఉసిరి కాయలు, అరటి బోదెలు, తదితర పూజా ద్రవ్యాల కొనుగోళ్లు జోరుగా సాగాయి. ఆలయాలను ఒకరోజు ముందే విద్యుత్‌కాంతులతో అలంకరించడంతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. 6

తప్పు దొర్లితే తిప్పలే..

- టెన్త్ నామినల్ రోల్స్ నమోదు షురూ
- అప్రమత్తత అవసరం అంటున్న అధికారులు
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 20వేల మంది 7
- నిబంధనలు పాటించాలన్న ఎస్సెస్సీ బోర్డు

బేతుపల్లి భూముల వివాదాలు తీరేనా?

- 133 సర్వే నెంబర్‌లో కొనసాగుతున్న సర్వే
- దశాబ్దాలుగా రగులుతున్న భూ సమస్యల కొలిమి
- హక్కుదారుల పేర్లు అడ్డగోలుగా తొలగింపు
- ప్రస్తుత సర్వేతో పరిష్కారంపై ఆశలు 7

చలికాలం వేళ జాగ్రత్త!

- పిల్లలను వెంటాడే న్యూమోనియా ముప్పు
- రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిపై ప్రభావం
- పెరుగుతున్న బాధితులు
- ముందుజాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు 6

ఇసుకాసురులు



స్యాండ్ మాఫియా

గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు

- 'సొసైటీ' ముసుగులో బినామీల ఇసుక దందా
- అధికారంలో ఎవరుంటే వారి చేతుల్లోనే క్వారీలు
- కొత్త క్వారీలను హస్తగతం చేసుకునేందుకు జోరుగా పైరవీలు
- అడ్డగోలు తవ్వకాలతో నిబంధనలకు పాతర
- కొన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే ఇసుక తవ్వకాలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారయంత్రాంగం

అధికారం మారితే నేతలు మారతారే తప్ప దందాల తీరులో ఎలాంటి మార్పులు ఉండవనడానికి ఉమ్మడి జిల్లాలో ఇసుక క్వారీల వ్యవహారమే ఉదాహరణ. గతంలో బీఆర్‌ఎస్ నేతల కనుసన్నల్లో సాగిన ఇసుక వ్యాపారం... ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ నేతల హస్తగతమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే చర్ల, మణుగూరు, పినపాక ప్రాంతాల్లోని ఇసుక క్వారీలను అధికార పార్టీ నేతలు హస్తగతం చేసుకొని దందా నడిపిస్తున్నారు. కొత్తగా గోదావరి పరీవాహక ప్రాంతంలో 17కు పైగా ఇసుక క్వారీలు రాబోతున్నాయి. ఇవన్నీ గిరిజన సొసైటీల పేరుతో అనుమతి తెచ్చుకుని బినామీ వ్యాపారం సాగించేందుకు రంగం సిద్ధమవుతోంది.

ఖమ్మం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి నదిపై చర్ల మండలంలో రెండు సొసైటీలు, మణుగూరు, పినపాక మండలాల్లో మూడు సొసైటీల పేరుతో ఇసుక వ్యాపారం సాగుతోంది. దుమ్ముగూడెం సీతమ్మసాగర్ పూడికతీత పేరుతో ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. ఇవి పేరుకే గిరిజన సొసైటీల పేరుతో నడుస్తున్నా.. గతంలో గులాబీ పార్టీ అండతో నడిపించిన ఇసుక బినామీలు ఇప్పుడు కొత్త ప్రభుత్వం రాగానే అధికార పార్టీ గూటికి చేరారు. వారి కనుసన్నల్లోనే ప్రతిరోజు వందల సంఖ్యలో ఇసుక లారీలు హైదరాబాదుకు తరలి వెళుతున్నాయి.

మణుగూరు, పినపాక ప్రాంతం నుంచి గోదావరి ఇసుక ఏటూరునాగారం మీదుగా హైదరాబాదు వెళుతుండగా.. చర్ల ప్రాంతం నుంచి తవ్వకాలు జరుగుతున్న ఇసుకను వెంకటాపురం, వాజేడు, ఏటూరునాగారం మీదుగా రవాణా చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో ప్రభుత్వం గిరిజన సొసైటీలకే ఇసుక క్వారీల అనుమతి ఇస్తుంది. గతంలో కొన్ని క్వారీలకు అనుమతులున్నా.. వాటి గడువు ముగియడంతో తవ్వకాలు నిలిపివేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇసుక క్వారీల్లోనూ గతంలో బీఆర్‌ఎస్‌లో చురుగ్గా పాల్గొని ఇసుక దందా నడిపించిన బినామీలే మళ్లీ పార్టీ ఫిరాయించి అధికారపార్టీ పేరుతో ఇసుక (మిగతా 6వ పేజీలో)

అనుమతులు లేకుండానే..

ఉమ్మడి జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంతంలోని పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాలతోపాటు కిన్నెరసాని పరివాహకంలోని పాల్వంచ, మొర్రేడు ప్రాంతంలోని టేకులపల్లి, కొత్తగూడెం, మున్నేరు ప్రాంతంలోని తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్, చింతకాని, ముదిగొండ, ఆకేరు ప్రాంతంలోని మధిర, ఎర్రుపాలెం తదితర మండలాల్లో అనుమతులు లేకుండానే ట్రాక్టర్లు, లారీల్లో రాత్రివేళ ఇసుక రవాణా చేస్తున్నారు. స్థానిక అవసరాల పేరుతో కొందరు ఇసుక తరలిస్తుండగా మరికొందరు అధికారపార్టీ నేతల పలుకుబడి ఉపయోగించి దందా సాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. ఇప్పటికైనా ఇసుక దందాపై అధికార యంత్రాంగం దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఖమ్మం కలెక్టరేట్‌లో టీఎన్జీవో, టీజీవో ఉద్యోగ సంఘాల ఆందోళన

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

- వికారాబాద్ కలెక్టర్‌పై దాడిని ఖండించిన నేతలు
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు 6

యువతి హత్యకేసులో తల్లి, కొడుకు అరెస్టు

ఆర్థిక, కుటుంబపరమైన గొడవలతోనే కడతేర్చినట్టు వెల్లడి

జూలూరుపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచినేనిపేట తండాలో సంచలనం కలిగించిన యువతి తోట స్వాతి హత్య కేసులో తల్లి, కొడుకును గురువారం అరెస్టు చేసినట్టు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఈ నెల 9న డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవ తలెత్తిన క్రమంలో స్వాతిని ప్రియుడు బానోతు భద్రం తలపై విచక్షణరహితంగా నరికి హత్య చేశాడని తెలిపారు. అనంతరం శవాన్ని పత్తి చేలో పూడ్చి పెట్టేందుకు భద్రంకు తల్లి సరోజ సహకరించినట్టు విచారణలో వెల్లడైందన్నారు. దీంతో ఇద్దరిని మాచినేనిపేట తండాలో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి, ఎస్‌ఐ రాణాప్రతాప్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది కోటి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి భరించలేకే..

భద్రంతో సహజీవనం చేస్తున్న స్వాతి.. సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రత్నకుమార్ అనే వ్యక్తి వద్ద రూ.15 లక్షలు తీసుకున్న విషయం విదితమే. అయితే ఉద్యోగం రాకపోవడంతో రత్నకుమార్ తన భార్యతో సహా ఆత్మహత్యకు పాల్పడగా, ఈ ఘటనలో భద్రంతోపాటు స్వాతిపై కేసు నమోదైంది. తాను తీసుకున్న డబ్బును భద్రంకు ఇచ్చానని ఆమె పోలీసులకు తెలిపింది. ఈ క్రమంలో తన డబ్బులు తనకివ్వాలని భద్రంపై కొన్నిరోజులుగా ఒత్తిడి చేస్తోంది. భద్రంకు భార్య నందిని, కుమారుడు ఉండగా, వారిని వదిలేయాలని స్వాతి పట్టుబడుతోంది. ఈ క్రమంలోనే ఈ నెల 9న ఇద్దరి మధ్య గొడవ జరగగా, భద్రం కత్తితో స్వాతిపై దాడిచేయడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు తెలిసింది. ఈ విషయాలను భద్రం పోలీసుల విచారణలో స్వయంగా తెలిపినట్టు సమాచారం.



చలిలో పిల్లలు జాగ్రత్త

చిన్నారుల్లో న్యూమోనియా ముప్పు



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రానికి చెందిన ఓ బాలుడికి వారం రోజులుగా జ్వరం రాగా ఆసుపత్రిలో పరీక్షలు చేయించారు. పరీక్షించిన వైద్యులు న్యుమోనియా వచ్చినట్టు నిర్ధారించారు.

● నగరానికి చెందిన మరో ఆరేళ్ల బాలుడు నితీష్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ఆ చిన్నారిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకురాగా.. ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నట్టు వైద్యులు తేల్చారు. దీంతో చిన్నారికి ఆసుపత్రిలో నాలుగు రోజుల పాటు చికిత్స అందించాల్సి వచ్చింది.

జిల్లాలో గతపది రోజులుగా వాతావరణ మార్పులతో అనేక మంది చిన్నారులు దగ్గు, శ్వాస సమస్యతో బాధపడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. అక్టోబరు నెల మూడోవారం నుంచి రాత్రిపూట వాతావరణం చల్లగా ఉంటుంది. వాతావరణ మార్పుల కారణంగా పిల్లలు జ్వరాలతో బాధపడుతున్నారు. కొందరు న్యూమోనియాతో బాధపడుతున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితోపాటు ప్రైవేటు దవాఖానాల్లోనూ ఓపీ పెరుగుతోంది. మొన్నటివరకు వేడి ప్రభావం ఎక్కువగా ఉండగా... పది రోజుల నుంచి రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గాయి. చల్లని వాతావారణం కారణంగా పిల్లల ఆరోగ్యం క్షీణిస్తోంది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రితోపాటు ప్రైవేటు దవాఖానాల్లోనూ పడకలు నిండిపోతున్నాయి. దగ్గు, జ్వరం, జలుబుతో అనేక మంది పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారిపై ప్రభావం

సీజనల్‌గా వచ్చే వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే మిగతా వారికి సోకుతోంది. సాధారణంగా పిల్లలకు రోగనిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. జలుబు, జ్వరం, దగ్గు వంటి లక్షణాలు కనపడుతున్నాయి. అనారోగ్య లక్షణాలకు తోడు శరీరం శక్తిని కోల్పోవడంతో చిన్నారులు తట్టుకోలేకపోతున్నారు. చలికాలం ముగిసాకా ఒక్కసారిగా వాతావరణ మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో మార్చి నెలలోనూ చిన్నారులకు అనారోగ్యసమ్యలు తలెత్తుతున్నాయి.

జిల్లా ఆస్పత్రిలో అక్టోబరు నెలలో పిల్లల ఓపీ ఇలా..

చిన్న పిల్లలు (ఐసీయూ) చేరిన వారు

మొత్తం అడ్మిషన్లు	: 82
జ్వరాలతో	: 28
కుక్కకాటు, పాముకాటు	: 4
న్యూమోనియా	: 31

చిన్నపిల్లల వార్డులో చేరికలు ఇలా :

జ్వరాలతో	: 49
కుక్కకాటు	: 4
న్యూమోనియా	: 8

మొత్తం 1386 చిన్నపిల్లల ఓపీగా నమోదైంది.

నిర్లక్ష్యం చేయొద్దు

డా. పవన్‌కుమార్, చిన్న పిల్లల వైద్యుడు



వాతావరణ మార్పులతో చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. జిల్లా ఆసుపత్రిలో పిల్లల ఓపీ బాగా పెరుగుతోంది. ప్రత్యేక విభాగంలో చికిత్స అందిస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పరిశీలిస్తూ ఉండండి. అసలు నిర్లక్ష్యం చేయవద్దు. జలుబు, దగ్గులు ఉన్నవారితో దూరంగా ఉంచాలి. మాస్కు ధరించేలా చూడాలి. చిన్నపిల్లలకు స్వీట్లు ఇతరత్రా తినిపించవద్దు.

కార్తీక పౌర్ణమికి వేళాయే...

» శివాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు


పూజా సామగ్రి కొనుగోళ్ల దృశ్యం


కూసుమంచి శివాలయంలో..


ఖమ్మం ఎస్పీ ఆఫీస్‌రోడ్ శివాలయంలో

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమికోసం భక్తులు సర్వం సిద్ధం చేసుకున్నారు.. కార్తీక పౌర్ణమి రోజున నూనె దీపాలను వెలిగించే సంప్రదాయం ఉండటంతో అందుకు అవసరమైన మట్టిప్రమిదల తోపాటు నూలు వత్తులు, నూనెలు, ఉసిరి కాయలు, అరటి బోదెలు, తదితర పూజా ద్రవ్యాలకొనుగోలుతో గురువారం సాయంత్రం ఖమ్మంలో వీధులు సందడిగా మారాయి.. దీపాలను ఉసిరి కాయలు, అరటి బోదెలలో సైతం వెలిగించి నీళ్లలో వదిలే సంప్రదాయం ఉంది కనుక వాటిని విక్రయించారు.. ప్రమిదలు, తదితర పూజా ద్రవ్యాలను పలు గ్రామాల నుంచి తీసుకొచ్చి స్థానికంగా అమ్మకాలు జరిపారు.

ఖమ్మం నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో భక్తుల రాక కోసం సకల ఏర్పాట్లు చేశారు.. ఒకో ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు బారులు తీరతారు కనుక రద్దీ తొక్కిసలాట జరగకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితీ కనుక ఆమేరకు ప్రత్యేక సిబ్బందిని సరంజామాను సమకూర్చారు. కార్తీక మాసం అయ్యప్ప దీక్షలతో పాటు ఇతరత్రా పూజలకు పరమ పవిత్రంగా భావిస్తారు. ఈ నెలలో వచ్చే పౌర్ణమికి మరింత విశిష్టత ఉండటంతో పౌర్ణమి రాక కోసం ఎదురు చూస్తుంటారు. కార్తీక పౌర్ణమి రోజును తెల్లవారు ఝామునే నదీస్నానాలు ఆచరించి జలవనరుల వద్ద దీపాలను వెలిగించటం చేస్తారు. పుణ్యక్షేత్రాలు, నదీ వనరులు అందుబాటులో లేకుంటే దేవాలయాల్లో దీపాలను వెలిగించటం చేస్తారు..

కార్తీక పౌర్ణమి రోజున శివాలయాల్లో ఓం నమశ్శివాయ, హరహర మహాదేవ, శంభో శంకర నినాదాలు మార్మోగుతాయి. ఏకాదశ రుద్రాభిషేకం వైభవోపేతంగా జరుగుతుంది.. రుద్రాభిషేకం శివుడికి ఎంతో ఇష్టం కనుక 11 సార్లు రుద్ర చమకం లేదా శివనామస్మరణ తో అభిషేకిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున వెలిగించే దీపాలు ప్రత్యేకతను కలిగి ఉంటాయి.. ఇవి 365 వత్తులతో పెద్దదీపాన్ని వెలిగిస్తారు. ఇందువల్ల ఏడాదిలో ప్రతి రోజూ దీపాన్ని వెలిగించినంత పుణ్యం లభిస్తుందన్న నమ్మకంతో భక్తులు ఈసంఖ్యను పాటిస్తారు. కార్తీకపౌర్ణమి రోజున శివాలయాలను అధికంగా సందర్శిస్తారు కాగా వైష్ణవ సంబంధ ఆలయాలను కూడా దర్శిస్తారు. కార్తీక పౌర్ణమి నాడు అత్యధికంగా శివుడిని పూజించే సంప్రదాయం ఉన్నా.. విష్ణు ఆలయాలు కూడా సందడిగా ఉంటాయి.. మహాప్రళయం నుంచి లోకాన్ని కాపాడేందుకు మహావిష్ణువు మత్స్య అవతారం ఎత్తింది ఈరోజునే అని భావిస్తారు. కనుక విష్ణువును ఆరాధిస్తారు. కార్తీక మాసం పూజలకే కాదు సత్యనారాయణ వ్రతాలకు ఎంతో విశిష్టమైనది కావటంతో కార్తీక పౌర్ణమి రోజును దివ్య ముహూర్తంగా భావించి పాటిస్తారు. కార్తీక మాసం విష్ణువుకు అత్యంత ప్రీతి పాత్రం కనుక సత్యనారాయణ వ్రతాలకు పూనుకుంటారు.

అడవి పంది మాంసం స్వాధీనానికి యత్నం

అటవీ ఉద్యోగిపై కత్తితో దాడికి యత్నించిన ఇద్దరు వ్యక్తులు

జూలూరుపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ అటవీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న అటవీ ఉద్యోగిపై ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడిచేయటానికి ప్రయత్నించిన సంఘటన మండలంలోని రాజారావుపేట అటవీప్రాంతంలో జరిగింది. ఈ సంఘటనపై సదరు ఉద్యోగి గురువారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజారావుపేట ఎఫ్‌బీవో షేక్.రహీం బుధవారం సాయంత్రం అటవీప్రాంతంలో పెట్రోలింగ్ చేసి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఆరుగురు వ్యక్తులు అటవీ ప్రాంతంలో ఉన్నారు. అక్కడకు వెళ్లి చూడగా వారు అడవిపందిని కాలుస్తున్నారు. మాంసాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయగా రహీంను పాపకొల్లు బీమ్లాతండాకు చెందిన బాదావత్ సురేష్, బాదావత్ సాయికుమార్ తోసివేసి కత్తితో దాడికి ప్రయత్నించారు. సదరు ఉద్యోగి ద్విచక్ర వాహనం తాళం తీసుకున్నారు. సెల్‌ఫోన్‌ను లాక్కునేందుకు ప్రయత్నించారు. అనంతరం ఆరుగురు మాంసాన్ని తీసుకుని ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయారు. సమాచారాన్ని ఎఫ్‌ఆర్‌వో ప్రసాదరావుకు అందించగా తోటి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని జరిగిన సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనపై కత్తిలో దాడి చేయటానికి ప్రయత్నించిన, విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

పారదర్శకంగా గ్రూప్-3 పరీక్షల నిర్వహణ

» 87 పరీక్షా కేంద్రాల్లో 27,984 మంది అభ్యర్థులకు ఏర్పాట్లు

» గ్రూప్ -3 పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లకు శిక్షణలో కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో గ్రూప్-3 పరీక్షలు నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో గ్రూప్-3 పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, శాఖాధికారులు, ఇన్విజిలేటర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 17 ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12-30గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5-30 వరకు రెండు సెషన్లు, 18న ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 12-30 వరకు గ్రూప్-3 పరీక్షలు జరుగుతాయని, ఖమ్మం జిల్లాలో మొత్తం 27వేల 984 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని, వీరి కోసం 87పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్టు తెలిపారు. ప్రశ్నపత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. నవంబరు 16న గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై పరీక్ష కేంద్రాల వారీగా చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు సమావేశాలు నిర్వహించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఒకరోజు ముందు పరీక్ష కేంద్రం పరిసరాలను చీఫ్ సూపరింటెండెంట్ క్షేత్ర సందర్శన చేసి, క్షుణ్ణంగా పరిశీలన చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రం కాంపౌండ్ వాల్ పరిస్థితి, కిటికీలు, చెట్లు ఏవైనా ఉన్నాయా పరిశీలించాలని, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల గేటు వద్ద ఒక గడియారం ఏర్పాటు చేయాలన్నారు.

పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8-30 నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1-30 నుంచి అనుమతించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9-30 గంటలకు, మధ్యాహ్నం 2-30 గంటలకు మూసి వేస్తామని, దీని తర్వాత పరీక్ష కేంద్రంలోకి ఎవరినీ అనుమతించరని, అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రంలో హాల్ నెంబర్లకు మార్గం తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు ఒకరోజు ముందు వెళ్లి పరీక్షా కేంద్రాన్ని చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు క్యాలిక్యులేటర్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆభరణాలు తీసుకుని రావొద్దని, చెప్పులు మాత్రమే వేసుకుని రావాలని, షూస్ వేసుకోవద్దని తెలిపారు. అభ్యర్థుల బయోమెట్రిక్ వెరిఫై చేయాలని అన్నారు. అభ్యర్థుల వివరాలతో కూడిన ఓఎంఆర్ షీట్లు వచ్చాయని, వాటిని సంబంధిత అభ్యర్థులకు అందేలా చూడాలని అన్నారు. పరీక్ష సమయం ముగిసిన తర్వాత పెన్ డౌన్ బెల్ మోగుతుందని, దాని తర్వాత ఏమి రాసిన అనుమతించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎంపీడీవోలు రూట్ అధికారులుగా వ్యవహరిస్తారని అన్నారు. పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌కు తప్ప ఎవరికీ సెల్‌ఫోన్ అనుమతిలేదని కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎస్‌బీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజ్ కుమార్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వి.చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు

ఇసుకాసురులు

(5వ పేజీ తరువాయి)

వ్యాపారం సాగిస్తున్నారు. దీనికి జిల్లాలో కొందరు నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో వీరి వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. ఈ దందాను పోలీసులు, రవాణా, మైనింగ్‌శాఖ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. పాత వేబిల్స్ పత్రాలు అడ్డుపెట్టుకుని ఇసుక తరలిస్తున్నారు. పైస్థాయిలో పోలీసులకు ఇసుక లారీలను ఎక్కడా ఆపవద్దని ఆదేశాలుండడం, పోలీసు అధికారులు కూడా నెలవారీ మామూళ్ల స్టేషన్లకు వెళుతుండడంతో అక్రమ ఇసుకవ్యాపారం జోరుగా సాగుతోంది.

కొత్తగా ఇసుక క్వారీలకు అనుమతి

ఏజెన్సీ ఏరియాలోని గోదావరి పరివాహక ప్రాంతంలో కొత్తగా 17క్వారీలకు అనుమతి ఇచ్చారు. వీటిని కూడా గిరిజన సొసైటీల పేరుతోనే అనుమతి ఇచ్చారు. అయితే పేరుకు గిరిజన సొసైటీలున్నా ఇసుక తవ్వకాలు, వ్యాపారం చేసేందంతా బినామీలే.. అధికారపార్టీ ముసుగులో ఉన్న కొందరు వ్యాపారులు తమ పలుకుబడి ఉపయోగించి గిరిజన సొసైటీలను ఏర్పాటు చేయించుకుని తవ్వకాలకు అనుమతి పొందుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ స్థాయి ప్రజాప్రతనిధుల అండతో 17 చోట్ల ఇసుక తవ్వకాలకు అనుమతి తెచ్చుకున్నారు.

జిల్లా స్థాయి అధికారులు, ఐటీడీఏ అధికారులు క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ చేయడంలేదు. పేరుకే సొసైటీల పేరుతో అనుమతులు తెచ్చుకుంటున్నా భారీ పొక్లెయిన్లతో ఇసుక తవ్వకాలు సాగిస్తూ విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నా నియంత్రణ జరగడంలేదు. కొత్త క్వారీల విషయంలోనూ ప్రతి క్వారీకి అధికారపార్టీకి చెందిన ముసుగువీరులు తెరవెనుక ఉండడంతో అనుమతి విషయంలో కూడా కొర్రీలు లేకుండానే పనవుతోంది. సొసైటీల నిర్వహణ, ఇసుక వ్యాపారంలో సొసైటీ కార్యవర్గం కంటే బినామీలదే నడుస్తోంది. కొత్త క్వారీలు తవ్వకాలతో గోదావరి నుంచి భారీగా ఇసుక తరలిపోనుంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లానుంచి ఏటా టీఎస్ఎండీసీకి రూ.200కోట్ల మేర ఇసుక ద్వారా ఆదాయం లభిస్తుంది. అధికారులు అనుమతి ఇచ్చేది కొంత అయితే అక్రమంగా తవ్వేది కొండంత.

ఇసుక తవ్వకాలు, రవాణాపై అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నందున ఇసుక వ్యాపారంపైనే పలువురు బినామీలు దృష్టిపెట్టి సొసైటీలు ఏర్పాటుచేయించి అనుమతులు సాగిస్తున్నారు. ఈ ఇసుక వ్యాపారులు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి వెళ్లడం, ప్రభుత్వస్థాయిలో పలుకువడి ఉన్న నేతలకు అనుచరులుగా మారడం, ఆ తర్వాత ఇసుక వ్యాపారాన్ని కొనసాగించడం ఒక తంతుగా సాగుతోంది. వాస్తవంగా సొసైటీ సభ్యులు ఇసుకను తవ్వడం, లోడుచేయడం, వారి రోజువారి మస్టర్లతో వచ్చిన లాభాన్ని ఖర్చులు పోను ఖాతాల్లో వేయడం చేయాలి. కానీ బినామీలు పొక్లెయిన్లు పెట్టి మొత్తం ఇసుక తవ్వకాలు, లోడింగ్ చేస్తున్నారు. మొక్కుబడిగా గిరిజనులకు సొమ్ము పంచుతున్నారు. సొసైటీ సభ్యులకు చెందాల్సిన ఆదాయం దొడ్డిదారిన బినామీలు నొక్కేస్తున్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

20 వరకు వివిధ అంశాల్లో పోటీలు

ఖానాపురంహవేలీ, నవంబరు 14 (ఆంధ్యజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏటా పాఠకుల్లో అవగాహన పెంచడానికి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తుంది. ఈ క్రమంలోనే ఈనెల 14వ తేదీ నుంచి 20 వరకు ప్రత్యేకంగా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ వారోత్సవాలను ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు, యువతకు, నిరుద్యోగులకు విజ్ఞాన బాండాగారాలు అని అన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు వ్యాచరచన, పాటల పోటీలు, ముగ్గుల పోటీలు, వకృత్వ పోటీలు, పుస్తక ప్రదర్శనలు నిర్వమించటం జరుగుతుందన్నారు.పోటీలలో గెలుపొందిన వారికి 20వ తేదీన బహుమతులు అందించటం జరుగుతుందని అన్నారు. డిఎస్సీ 2024లో గ్రంథాలయంలో చదివి ఉపాధ్యా పోస్టులకు 12 మంది ఎంపికైనట్లు తెలిపారు. గ్రంథాలయంలో లభించే పుస్తకాలు చదివి ఉద్యోగాలు సాదిస్తున్నారని అన్నారు.

ఎలాంటి ప్రత్యేక కోచింగ్‌లు తీసుకోకుండ గ్రంథాలయంలో లభించే పుస్తకాను చదివి ఉద్యోగాలు సాదించటంసాదారణ విషయం కాదన్నారు. ఏడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వారోత్సవాల వివరాలు

14న చిన్నారులచే స్వాంతంత్ర సమరయోధుల వేషధారణలు, 15న గ్రంథాలయంలో ఉన్న అరుదైన పుస్తకాల ప్రదర్శన, 16న విశ్రాంత ఉద్యోగులకు సన్మానం, కవి సమ్మేళనం, 17న వకృత్వ పోటీలు, 18న పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు, 19న రంగోలి, మ్యూజికల్ చైర్ పోటీలు, 20న వారోత్సవాల ముగింపు, బహుమతులు ప్రదానం.

వైద్య కళాశాలలో డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్స్‌లలో చేరుటకు దరఖాస్తు గడువు ఈ నెల 20 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, బైపీసీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత, ఎంపీసీ విద్యార్థులకు రెండో ప్రాధాన్యతతో సీట్ల కేటాయింపు ఉంటుందని రాజేశ్వరరావు ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు, రేపు మధిరలో జాతీయస్థాయి బాలోత్సవ్

మధిర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రామ భక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో 27వ జాతీయస్థాయి మధిర బాలోత్సవ్ పోటీలు శుక్ర, శనివారాల్లో మధిరలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ కల్యాణమండపంలో జరగనున్నాయి. ఇందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాలనుంచి 524 ఎంట్రీలు విద్యార్థుల నుంచి వచ్చినట్టు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, బాబా తెలిపారు. హైదరాబాద్, వరంగల్, భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం, సత్తుపల్లి, తల్లాడ, కల్లూరు, వీఎం బంజర, వైరా, ఎర్రుపాలెం, బోనకల్, కోదాడ, విజయవాడ, బాపట్ల, నందిగామ, జగ్గయ్యపేట, గంపలగూడెం, ఊటుకూరు, తదితర ప్రాంతాలనుంచి విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం 10గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. తొలిరోజు ఉదయం శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాల్లో పోటీలు ఉంటాయి. రెండోరోజు నీసత్తా చాటుకో, నీతి పద్యాలు, ఏకపాత్రలు, దేశభక్తి గీతాలు, సందేశాత్మక ఉపన్యాసం, విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం విజేతలను ప్రకటించి బహుమతులను అందజేస్తారు.

ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేస్తున్నాం

(5వ పేజీ తరువాయి)

ఉంచాం. అయితే ఎక్కువస్థాయిలో ధాన్యం వస్తే ఆ టార్పాలిన్స్ అందరికీ సరిపోవు. అందువల్ల రైతులే సొంతంగా టార్పాలిన్స్ తెచ్చుకుంటే మంచిది.

ప్ర: ప్రైవేటు మిల్లర్లు కూడా ధాన్యం కొనుగోళ్లను చురుగ్గా చేస్తున్నారు కదా ?

జ: ప్రైవేటు మిల్లర్లు సొంతంగా ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉంది. రైతులకు ఎవరికైనా అమ్ముకునే స్వేచ్ఛ ఉంది. తేమ ఎక్కువగా ఉన్నా ప్రైవేటు వ్యాపారులు కొంటున్నారని, రైతులు ఇష్టపూర్తిగా అమ్ముకుంటే మేం అడ్డుచెప్పలేం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలుండడం వల్లనే ప్రైవేటులో ధర స్థిరంగా ఉంది.

ప్ర: రైతులకు మద్దతు ధర, బోనస్ ఎలా చెల్లిస్తారు ?

జ: ప్రభుత్వం సన్నరకాలకు క్వింటాకు రూ.2,320, దొడ్డురకాలకు రూ.2,300 మద్దతు ధర నిర్ణయించింది. సన్నరకాలకు అదనంగా రూ.500 బోనస్ కూడా ఇస్తున్నాం. రైతులు ధాన్యం అమ్మిన తరువాత 48 గంటల్లో వారి ఖాతాల్లో సొమ్ము జమఅవుతుంది. ముందు ధాన్యం మద్దతు ధర సొమ్ము చెల్లించి తరువాత బోనస్ సొమ్మును జమ చేస్తాం.

ప్ర: సన్న, దొడ్డురకాల నిర్ధారణ ఎలా చేస్తారు ?

జ: కొనుగోలు కేంద్రాల వద్ద సన్న, దొడ్డురకాల నిర్ధారణ యంత్రాలు ఏర్పాటు చేశాం. రైతులు ధాన్యం గడ్డి, నూగుతో తీసుకువస్తే దానిని శుభ్రం చేసేందుకు ప్యాడీ క్లీనర్ కూడా అందుబాటులో ఉంచాం.

ప్ర: సీఎంఆర్ కోసం జిల్లాలో ఎన్ని మిల్లులకు అనుమతి ఇచ్చారు ?

జ: జిల్లాలో 67వరకు రైస్‌మిల్లులుండగా 43మిల్లులకు సీఎంఆర్ ధాన్యం ఇచ్చేందుకు నిర్ణయించాం. ఈ మిల్లులు గతంలో సీఎంఆర్ బియ్యానికి సంబంధించి బకాయి పడలేదు. అలాగే 15రోజుల్లోగా బ్యాంకు గ్యారంటీలు ఇచ్చేందుకు అండర్‌టేకింగ్ రాతపూర్వకంగా ఇచ్చారు. అందువల్ల వారికి కొనుగోలు కేంద్రాలనుంచి ధాన్యం పంపిస్తాం.

ప్ర: జిల్లాలో సీఎంఆర్ ధాన్యం బకాయి ఉన్న రైస్‌మిల్లుల పరిస్థితి ఏంటి ?

జ: లెవీ బకాయిల కారణంగా కొణిజర్ల మండలంలోని రైస్‌మిల్లును సీజ్‌చేశాం. మిగిలిన రైస్‌మిల్లులకు కూడా నోటీసు ఇచ్చాం. వారికి ఈ నెలాఖరు వరకు గడువిచ్చాం. సుమారు 8,500 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం మిల్లుల నుంచి రావాల్సి ఉంది.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

వికారాబాద్ కలెక్టర్‌పై దాడిని ఖండించిన నేతలు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై దాడికి నిరసనగా టీజీఈజేఏసీ పిలుపు మేరకు గురువారం జిల్లా కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసనవ్యక్తం చేశారు. టీఎన్జీవో, టీజీవో, ఇతర ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ఉద్యోగులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ లాంటి వ్యక్తులపైనే భౌతిక దాడులకు పాల్పడడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు కలెక్టర్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు గుంటుపల్లి శ్రీనివాస్, బుల్లెట్ శ్రీను, తాళ్లూరి శ్రీకాంత్, టీజీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, రాజేష్, ట్రెసా అధ్యక్షుడు తుంబూరు సునీల్‌రెడ్డి, సకల ఉద్యోగులు, అన్ని సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

దాడి హేయమైన చర్య: గరికె ఉపేంద్రరావు

వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, అధికారులపై జరిగిన దాడిని ఉద్యోగులు ఖండించాలని వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు కోరారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద పూర్వ వీఆర్వోలు నిరసన తెలిపారు. ఈ దాడి ఒకరిద్దరు అధికారులపైన జరిగిన దాడిగా చూడవద్దని, తెలంగాణలోని యావత్ ఉద్యోగలోకంపై జరిగిన దాడిగా భావించాలని ఉపేంద్రరావు అన్నారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతి పత్రాన్ని అందచేశారు.

17న స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లపై బహిరంగ విచారణ

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై ఈనెల 17న బహిరంగ విచారణ చేస్తున్నట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్ దామాషా ఖరారు చేసేందుకు బీసీ కమిషన్ డెడికేషన్ ఛైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరపనున్నట్టు తెలిపారు. ఉదయం11:30 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రజల అభిప్రాయాలు తెలపవచ్చన్నారు.

దుకాణంలో సామగ్రి చోరీ చేసిన గుమస్తా

భద్రాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని మసీదు సెంటర్లోని ఓ పైపుల ఏజెన్సీ దుకాణంలో సామగ్రిని సంబంధిత షాపులోని గుమస్తానే చోరీ చేసినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా విడతల వారీగా దుకాణంలోని సామగ్రిని యజమానికి అనుమానం రాకుండా చోరీ చేసి ఆ సామగ్రిని ఎదురుగా ఉన్న ఓ దుకాణంలో విక్రయించినట్లు తెలుస్తోంది. ఈ విధంగా సుమారు రూ.6లక్షల విలువైన సామగ్రి చోరీ చేసినట్లు సమచారం. ఈ సామగ్రిని విక్రయించిన ఘటనల్లో ఆ రెండు దుకాణాల గుమస్తాల పాత్ర ఉందని తెలిసింది. ఈ క్రమంలో తమ దుకాణంలో సామగ్రి చోరీకి గురైన విషయం ఆలస్యంగా తెలుసుకున్న సంబంధిత దుకాణం యజమాని పూర్తిస్థాయిలో సమాచారం సేకరించి ఇందుకు సంబంధించిన వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో భద్రాచలం పోలీసులు ఈ విషయంపై విచారణ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ ఇద్దరు గుమస్తాలను విచారిస్తున్నట్లు సమచారం. ఇదిలా ఉండగా పట్టణంలో వ్యాపారం చేస్తూ మరో వ్యాపారికి చెందిన చోరీ సొత్తును అక్రమంగా కొనుగోలు చేయడం భద్రాచలంలో సంచలనంగా మారింది. కాగా కొనుగోలు చేసిన చోరీ సొత్తులో కొంత సామగ్రి సదరు రెండో దుకాణం వ్యాపారి ఇప్పటికే కొంతమందికి విక్రయించినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసు అధికారులు ఇందుకు సంబంధి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

మానవహక్కుల కమిషన్ సభ్యులమంటూ మోసగించే యత్నం

» అనుమానం వచ్చిన సీపీ కార్యాలయ సిబ్బంది » త్రీటౌన్ పోలీసులకు అప్పగింత

ఖమ్మం క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మానవహక్కుల కమిషన్ సభ్యులమని పోలీసు కమిషనర్‌ను కలవాలని వచ్చిన ఇద్దరిని గురువారం త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం విజయవాడకు చెందిన పురాణం పద్మజ, శ్రీపతి జగదీశ్వరరావు అనే ఇద్దరు తాము జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యులమంటూ పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను కలవాలంటూ పుష్పగుచ్ఛంతో గురువారం నగరంలోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న సీపీ కార్యాలయానికి వచ్చారు. అక్కడ సిబ్బందికి అనుమానం రావడంతో వారిని ప్రశ్నించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది సీపీ దృష్టి కి తీసుకువెళ్లడంతో వారిపై విచారణ జరిపాలని త్రీటౌన్ పోలీసులకు ఆదేశించారు. వీరు గతంలో పలువురిని మోసం చేశారని, నగరంలోని ఖానాపురానికి చెందిన సురేష్ అను వ్యక్తి వద్ద మానవహక్కుల కమిషన్‌లో పదవి ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి డబ్బులు తీసుకున్నట్టు తెలిసింది. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

‘వీవీసీ’ సేవా కార్యక్రమాలు విస్తరిస్తాం

» సంస్థల చైర్మన్ రాజా


రక్తదానం చేస్తున్న వీవీసీ డైరెక్టర్

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవా కార్యక్రమాలు అందించేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సేవా కార్యక్రమాలు విస్తరిస్తామని వీవీసీ సంస్థల చైర్మన్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్(రాజా)వివరించారు. గురువారం ఖమ్మంలో దివంగత వంకాయలపాటి వెంకట రమణప్రసాద్ 61వ జయంతిని నిర్వహించారు. రక్తదాన శిబిరం నిర్వహించి పలువురు డైరెక్టర్లు, వీవీసీ సంస్థలోని 60 మంది ఉద్యోగులు రక్తదానం చేసి ప్రభుత్వ మేడికల్ కాలేజీకి అందించారు. వీవీసీ సంస్థల డైరెక్టర్లు వీరేన్ చౌదరి, వికాస్ చౌదరి చేతుల మీదుగా రూ.5 లక్షల విలువైన పార్థీవ వాహనాన్ని ప్రభుత్వ మేడికల్ కాలేజీకి వితరణగా అందించారు. నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, ఇతర సౌకర్యాలను అందించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వంకాయలపాటి వెంకటరమణ ప్రసాద్ నిర్వహించిన సేవా కార్యక్రమాలను వివరించారు. చిన్నతండా పాఠశాలను వీవీసీ సంస్థ దత్తత తీసుకొని కావాల్సిన సౌకర్యాలను అందిస్తామని ప్రకటించారు. ఈకార్యక్రమంలో వీవీసీ సంస్థల ఎండీ ద్రౌపతి, విక్రమాదిత్య పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సీపీఎం సిద్ధమవుతోంది

ఖమ్మంటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటాలకు సీపీఎం సిద్ధం అవుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు పోతినేని సుదర్శన్ పేర్కొన్నారు. గురువారం సీపీఎం త్రీటౌన్ 8వ మహాసభ నగరంలోని వర్తక సంఘభవనంలో నిర్వహించారు. సందర్భంగా పోతినేని మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలు కోసం సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలో వజినేపల్లి శ్రీనివాసరావు, ఎర్రా గోపి, పత్తిపాక నాగసులోచన, ఎల్లంపల్లి వెంకట్రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్యాణం వేంకటేశ్వరావు, వై. విక్రమ్, బండి రమేష్, జిల్లానాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమంలో విద్యార్థులు మమేకమవ్వాలి

ఖమ్మంటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ఉద్యమంలో విద్యార్థులు మమేకమవ్వాలని సీపీఐ జిల్లాకార్యదర్శి పోటు ప్రసాద్ కోరారు. వందేళ్ల ఘన చరిత్ర కలిగిన సీపీఐలో ఏఐఎస్ఎఫ్ పాత్ర మరవలేనిదన్నారు. జిల్లా సీపీఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సమావేశంలో పోటు ప్రసాద్ పార్టీ సభ్యత్వాన్ని ఏఐఎస్ఎఫ్ నాయకులకు అందచేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కూచిపూడి రవి, జిల్లా సహాయ కార్యదర్శి నాగుల్‌మీరా, శినాయక్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బేతుపల్లి రెవెన్యూలో కొనసాగుతున్న సర్వే

» న్యాయం కోసం భూ యజమానుల ఎదురు చూపు
» ప్రస్తుత సర్వేతో సరి చేస్తామంటున్న అధికారులు



సత్తుపల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని 133 సర్వే నెంబర్‌లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డుశాఖ ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతోంది. ఈ సర్వే నెంబర్‌లో భూములు సాగు చేసుకుంటున్న వారికి ఏళ్లతరబడి హక్కులు కల్పించకపోవటం, టైటిల్ ఉన్న వారిని అడ్డగోలుగా రికార్డుల నుంచి తొలగించటం, విస్తీర్ణానికి మించి గతంలో యజమానుల పేర్లు రాయటంతో దశాబ్దాల కాలంగా సమస్య ఉంది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు సర్వే, సెటిల్ మెంట్ మాత్రమే మార్గమని అధికారులు భావించారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి పూర్తి స్థాయిలో సర్వే చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ గంగారం గ్రామం వచ్చి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనతంరం సర్వే ప్రారంభించారు. 133 సర్వే నెంబర్‌తో పాటు పక్కనే ఉన్న పలు సర్వే నెంబర్లలో భూమిని కూడా అప్పట్లో సర్వే చేశారు. కాని ఏమి జరిగిందో తెలియదు కానీ.. కొందరు రైతులకు మాత్రమే అప్పట్లో న్యాయం జరిగిందని స్థానిక రైతులు చెపుతున్నారు. ఆ తరువాత ప్రక్రియ ముందుకు సాగలేదు. ధరణి నుంచి తొలగించిన తమ భూముల వివరాలు తిరిగి నమోదు చేయాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వారు లేకపోలేదు. ఆర్థిక, రాజకీయ బలం లేని కారణంగా తమకు పాస్‌పుస్తకాలు రాలేదని పలువురు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారుల తీరుతో విసిగిపోయిన కొందరు న్యాయ పోరాటం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మరలా సర్వే....

133 సర్వే నెంబర్‌లోని మొత్తం 3090 ఎకరాల విస్తీర్ణం సర్వే చేయాలని అధికారులు ఆదేశించటంతో ఈ సర్వే నెంబర్‌తో పాటు పక్కనే ఉన్న 148 సర్వే నెంబర్‌లోని విస్తీర్ణం కూడా సర్వే చేపట్టారు. 133 సర్వే నెంబర్‌లో ఇళ్లు, రోడ్లు, ప్రభుత్వ పాఠశాల, చెరువులు పోగా మిగిలిన భూమి ఎంత ఉంది అందులో ఎవరు సాగు చేసుకుంటున్నారో సర్వే సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. పక్కనే ఉన్న 148 సర్వే నెంబర్‌తో పాస్‌పుస్తకాలు ఉండి 133 సర్వే నెంబర్‌లో భూములు సాగు చేసుకుంటున్న వారి వివరాలు బయటకు వస్తున్నాయి. అసలు భూమి లేకుండా 133 సర్వే నెంబర్‌లో హక్కులు పొందిన వారు కూడా ఉన్నారు. అస్సైన్‌మెంట్ భూములు కొనుగోలు చేసి 133 సర్వే నెంబర్ పట్టా భూమితో హక్కులు పొందిన వారి కూడా వెలుగులోకి వస్తున్నారు.

పూర్తిస్థాయి పరిష్కారానికి సన్నాహాలు

మూడేళ్ల క్రితం సర్వే చేసిన వివరాలు ఇప్పటికే సర్వే సిబ్బంది వద్ద ఉన్నాయి. వీటి ఆధారంగా ఎవరు ఎంత విస్తీర్ణంలో సాగులో ఉన్నారు. వారి ఆధారాలు ఏమిటనేది సేకరిస్తున్నారు. గతంలో రెండు పర్యాయాలు సర్వే జరిగి ప్రక్రియ నిలిచిపోవటంతో ప్రస్తుతం సర్వేతో అయినా తమ సమస్య తీరుతుందా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

శాశ్వత పరిష్కారానికి కృషి

రాజేందర్ గౌడ్-ఆర్డీవో కల్లూరు



133 సర్వే నెంబర్‌లో భూ యజమానుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాలతో సర్వే చేయిస్తున్నాం ప్రతి రైతుకు సంబంధించి రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తాం. ఈ సర్వే నెంబర్‌లో అనర్హులను తొలగించి అర్హులకు హక్కులు కల్పిస్తాం. ఈ సర్వేతో పరిష్కారం లభించనుంది.

బిర్సా ముండా జయంతి నేడు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ధర్తి ఆలా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గిరిజనభవన్‌లో ఉదయం 10.30 గంటల నుంచి గిరిజన గౌరవ దినోత్సవ సమారోహము నిర్వహిస్తున్నట్లు ఆ ప్రకటనలో చెప్పారు. గిరిజన సంఘాలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

మృదంగ కళాకారుడికి కలెక్టర్ ప్రశంసా పత్రం


ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన మృదంగ కళాకారుడు, విద్యార్థి శ్రీకాకుళం సూర్యతేజకు భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. బాలలదినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం కలెక్టరేట్‌లో ప్రశంసాపత్రం అందజేశారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సంగీత కార్యక్రమంలో, భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే సంగీత కార్యక్రమాల్లో సైతం సూర్యతేజ మృదంగ సంగీత సహకారం అందిస్తుంటారు. భద్రాచలంలోని సెయింట్‌పాల్స్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు.

కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీపై రాష్ట్రస్థాయి ఉద్యమం

» ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వం విఫలం
» పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్


మాట్లాడుతున్న ప్రదీప్

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు14 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీపై రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేస్తామని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్ పేర్కొన్నారు. గురువారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పీవైఎల్, పీవోడబ్ల్యూ సంయుక్త సమావేశంలో మాట్లాడారు. జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే లెక్కల మేరకు కార్పొరేట్ హాస్పటల్స్ దోపిడీ కారణంగా 3నుంచి 4శాతం మధ్య తరగతి ప్రజలు పేదలుగా మారిపోతున్నారని, తమ ఆస్తులను అమ్ముకొని వైద్యసేవలు పొందుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వైద్యం సరిగా అందక పోవటంతోనే ప్రైవేట్ హాస్పటల్స్‌ను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పర్యవేక్షణ కోల్పోవటంతో హెల్త్ ఇన్సూరెన్స్‌లో అవకతవకలు జరుగుతున్నాయని వివరించారు. ప్రభుత్వం విచారణ జరపాలని, వ్యాధి నిర్ధారణ కేంద్రాల్లో పరీక్షలకు ప్రభుత్వమే ధరల నిర్ణయం జరపాలని డిమాండ్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్‌చేశారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేయటం ద్వారానే పేద, మధ్య తరగతి ప్రజలకు ఆరోగ్య సేవలు అందుతాయన్నారు. పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జే ప్రేమ్ సింగ్, ఎస్కే రాకేష్, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆవుల మంగతాయి, ఝాన్సీ, మామిడాల వెంకటేష్, అశోక్ పాల్గొన్నారు.

ఫైళ్ల డిజిటలైజేషన్‌పై అవగాహన

» జీఎంలు, అధికారులకు శిక్షణ
» సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్

కొత్తగూడెం,నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఫైళ్ల డిజిటలైజేషన్‌పై గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం సింగరేణి సంస్థలో ఫైల్‌లు, డాక్యుమెంట్లు, కరస్పాండెన్స్‌ల వివరాలను ఏ విధంగా ఎస్‌పీపీ ఫైల్‌లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ అప్లికేషన్ (ఈ-ఆఫీస్) మాధ్యమంలో ఎలా పొందుపర్చాలో, పని తీరును తెలియచేయడానికి సింగరేణి కార్పొరేట్ పరిధిలోని అన్ని శాఖల జీఎంలు, అధికారులకు ఈ కార్యక్రమం నిర్వహించారు.సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డైరెక్టర్ (పీపీ)పా జి.వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్ (ఈఅండ్ఎం) ఆపరేషన్స్ డి. సత్యనారాయణ పాల్గొన్నారు. సింగరేణి సంస్థలో ఎస్ఏపీ అప్లికేషన్ 2007-08 నుంచి అమలు పరుస్తున్నామని, కోల్‌అనుబంధ సంస్థల్లో తొలుత సింగరేణి సంస్థలో అమలుపర్చామని వివరించారు. ప్రస్తుతం సంస్థలో ఫైల్‌లు, డాక్యుమెంట్లు, కరస్పాండెన్స్‌ల వివరాలను ఫైల్‌లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ అప్లికేషన్ (ఈఆఫీస్) రూపంలో డిజిటల్ మాధ్యమంలో పొందుపర్చటానికి నిర్ణయించామని పేర్కొన్నారు. ఇకపై రోజువారి చేసే లెటర్స్, నోట్స్, ఇతర డాక్యుమెంట్లను పేపర్‌పై కాకుండా నేరుగా డిజిటల్ రూపంలోనే చేయటానికి చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. పేపరును ఆదా చేయడంతోపాటు అతి తక్కువ సమయంలో నోట్స్, లెటర్లను త్వరితగతిన ఆమోదించటానికి వీలు ఉంటుందని తెలిపారు. ప్రాజెక్టు మేనేజరు (ఈఆర్‌పీ) హర్‌ప్రసాద్, జీఎం (పర్చేస్) ఎం. సుబ్బారావు, జీఎం (ఎఫ్అండ్ఏ) ఎం. సుబ్బారావు, జీఎంలు దామోదరరావు, రాంకుమార్, నారాయణరావు, కే. ప్రసాదరావు, ఎలిషా, శ్రీనివాసరావు, రామచంద్రమూర్తి, జేసురత్నం, బెనెడిట్ నికోలస్, ఇతర జీఎంలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్


గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలని, ఆ దేవాలయాలపై ఆధారపడి చదువులు సాగించిన వారి జీవితాలు సుంధరమయంగా ఉంటాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభిప్రాయపడ్డారు. గురువారం కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మం దిర హాలులో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాల పితామహుడు ఎస్ఆర్.రంగరాజన్ చాచా నెహ్రూ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, మునిసిపాలిటీ కమిషనర్ శేషాంజనస్వామి, గ్రంథాలయ ఆఫీస్ ఇన్ చార్జ్ ఎం.నవీన్‌కుమార్, గ్రంథపాలకురాలు జి.మణి మృదుల, మధుబాబు, వంశీ, జానీ, వాణి, రుక్మిణి, గీత తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లిలో పోలీస్ బేస్ క్యాంప్ ఏర్పాటు

చర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులే లక్ష్యంగా కేంద్ర బలగాలు అడుగులు వేస్తున్నాయి. 2026 నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని అమిత్‌షా చెప్పిన విధంగానే బలగాలు పావులు కదుపుతున్నాయి. ఇందులో భాగంగా మావోయిస్టుల కదలికల అధికంగా ఉండే తెలంగాణకు సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా కొండపల్లి గ్రామంలో గురువారం బలగాలు సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంప్‌ను ప్రారంభించాయి. దీంతో పాటు మరో గ్రామమైన తుమల్ పాడ్‌లో కూడా పోలీస్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు.. ప్రస్తుతం ఈ రెండు క్యాంపుల నుంచి సుమారు 5వేల మంది ప్రత్యేక బలగాలు గాలింపు చర్యలు చేపట్టనున్నాయి. కాగా మావోయిస్టు పార్టీ రాజధానిగా పిలిచే పూవర్తి గ్రామంలో గత కొన్ని నెలల క్రితం పీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపుని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా పూవర్తి గ్రామం, కొండపల్లి గ్రామానికి కేవలం 10 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది.

ముగిసిన భద్రాద్రి జోనల్ స్థాయి క్రీడా పోటీలు


సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

వైరా, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వైరాలో నాలుగు రోజుల పా టు జరిగిన భద్రాద్రి జోన్ పదోవ జోనల్ స్థాయి క్రీడలు గురువారం ముగిశాయి. గేమ్స్ అండ్ అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ వైరా బాలికల గురుకులం (అండర్ 14), భద్రాచలం బాలికల గురుకులం(అండర్-17), కల్లూరు బాలికల గురుకులం(అండర్-19)లో సాధించాయి. అథ్లెటిక్స్‌లో వ్యక్తిగత చాంపియన్ షిప్ సాధించిన విజేతలు ఎస్.భార్గవి-వైరా(అండర్-14), కె.స్రవంతి-భద్రాచలం(అండర్-17), ఎన్.సరిత-ఇల్లెందు(అండర్-19), గేమ్స్‌లో వ్యక్తిగత చాంపియన్‌షిప్ విజేతలు ములకలపల్లి గురుకులం(అండర్-14,17), కల్లూరు గురుకులం(అండర్-19) విద్యార్థులు 8 క్రీడాంశాల్లో అత్యధిక పాయింట్లు సాధించారు.

అండర్-14 విభాగంలో కబడ్డీలో ములకలపల్లి(ప్రథమ), కల్లూరు(ద్వితీయ), ఖోఖోలో ములకలపల్లి(ప్రథమ), అడవిమల్లెలా(ద్వితీయ), టెన్నికాయిట్ డబుల్స్‌లో దాన్వాయిగూడెం(ప్రథమ), వైరా(ద్వితీయ), క్యారమ్స్‌లో నేలకొండపల్లి(ప్రథమ), కూసుమంచి(ద్వితీయ), చదరంగంలో అడవిమల్లెలా(ప్రథమ), ఎర్రుపాలెం(ద్వితీయ) సాధించాయి.

అండర్-17 విభాగంలో కబడ్డీలో ములకలపల్లి(ప్రథమ), వైరా(ద్వితీయ), ఖోఖోలో ఎర్రుపాలెం(ప్రథమ), ములకలపల్లి(ద్వితీయ), వాలీబాల్ భద్రాచలం(ప్రథమ), కూసుమంచి(ద్వితీయ), హ్యాండ్ బాల్ ఇల్లెందు(ప్రథమ), కల్లూరు(ద్వితీయ), బాల్‌బ్యాడ్మింటన్‌లో మధిర(ప్రథమ), వైరా(ద్వితీయ), టెన్నీకాయిట్ డబుల్‌లో దాన్వాయిగూడెం(ప్రథమ), పాల్వంచ(ద్వితీయ), క్యారమ్స్ డబుల్స్‌లో టేకులపల్లి(ప్రథమ), ములకలపల్లి(ద్వితీయ), చందరంగంలో నేలకొండపల్లి(ప్రథమ), పాల్వంచ(ద్వితీయ) స్థానాలు సాధించాయి.

అండర్-19 విభాగం కబడ్డీలో ములకలపల్లి(ప్రథమ), అడవిమల్లెలా(ద్వితీయ), ఖోఖోలో కల్లూరు (ప్రథమ), ఎర్రుపాలెం(ద్వితీయ), వాలీబాల్‌లో కల్లూరు(ప్రథమ), అంబేద్కర్ కాలేజీ ఖమ్మం(ద్వితీయ), హ్యాండ్‌బాల్ పోటీల్లో కల్లూరు(ప్రథమ), టేకులపల్లి(ద్వితీయ), టెన్నీకాయిట్ డబుల్స్‌లో దాన్వాయిగూడెం(ప్రథమ), వైరా(ద్వితీయ), బాల్‌బ్యాట్మిన్‌లో మధిర(ప్రథమ), వైరా(ద్వితీయ), క్యారమ్‌లో ఎర్రుపాలెం(ప్రథమ), అంబేద్కర్ కాలేజీ ఖమ్మం(ద్వితీయ), చదరంగంలో అంబేద్కర్ కాలేజీ ఖమ్మం(ప్రథమ), అడవిమల్లెలా(ద్వితీయ) స్థానాలు సాధించాయి.

తప్పు దొర్లితే తిప్పలే..

» ఎస్ఎస్‌సీ నామినల్ రోల్స్ నమోదులో అప్రమత్తత అవసరం » జిల్లాలో 20 వేల మంది విద్యార్థుల సన్నద్ధత



ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పదో తరగతి మార్కుల మెమోలో విద్యార్థుల వ్యక్తిగత వివరాల్లో తప్పులు దొర్లితే వాటిని మళ్లీ సవరించుకోవడం సాధారణ విషయం కాదు. ఇందుకు సుదీర్ఘ సమయం ఉంటుంది. విద్యార్థికి సంబంధించిన జనన ధ్రువపత్రం, ఆధార్ వంటి వాటిల్లో ఏ విధంగా పేరు ఉంటుందో అదే విధంగా ఇంగ్లీష్ అక్షరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఒక్క అక్షరం తప్పు వచ్చినా భవిష్యత్‌లో ఉన్నత విద్యనభ్యసించేందుకు, పాస్‌పోర్ట్, వీసా పొందేందుకు ఎన్నో ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. సర్టిఫికెట్లో తప్పులు దొర్లితే సవరించుకునేందుకు విద్యార్థి చదివిన పాఠశాల నుంచి ప్రారంభించి ఎన్నో ధ్రువపత్రాలు, అఫిడవిట్లు సిద్ధం చేసుకుని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో సమర్పించి అక్కడ నుంచి పొందాల్సి ఉంటుంది.

నామినల్‌రోల్స్ ఎంతో కీలకం..

పాఠశాల విద్యలో పదో తరగతి చివరి దశ. ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులు సమగ్ర వివరాలతో కూడిన సర్టిఫికెట్ అందుకోవడం కీలకమైన అంశం. తదుపరి ఉన్నత విద్యాభ్యాసం కోసం పదో తరగతి మార్కుల జాబితానే ప్రామాణికం. ఇటువంటి నేపథ్యంలో పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల వివరాలను సక్రమంగా ప్రభుత్వానికి పంపించే బాధ్యత ఆయా పాఠశాలల యాజమాన్యాలపై ఉంటుంది. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 419 స్కూళ్ల నుంచి 20 వే ల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ క్రమంలో పరీక్షలకు ఫీజు చెల్లించిన విద్యార్థుల వ్యక్తిగత వివరాలు (పేరు, ఇంటి పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ) వంటివి చైల్డ్‌ఇన్‌ఫోతో సరిచూసుకొని నామినల్ రోల్స్‌లో తప్పులు లేకుండా పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా పంపాలని ప్రభుత్వ పరీక్షల విభాగంఆదేశించింది.

ఫీజుల షెడ్యూల్ ఇలా..

టెన్త్ పరీక్షల ఫీజును అపరాధ రుసుం లేకుండా చెల్లించేందుకు ఈ నెల 18 వరకు అవకాశం కల్పించారు. రూ.50 అపరాధ రుసుంతో గడువు డిసెంబరు 2 వరకు, రూ.200 అపరాధ రుసుంతో డిసెంబర్ 12 వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 21 వరకు చెల్లించొచ్చు. అదనపు రుసుంతో ఫీజు చెల్లించే విద్యార్థుల నామినల్ రోల్స్. ఫీజు గడువు ముగిసిన రెండు రోజుల్లో డీఈవో కార్యాలయంలో అందజేయాలి.

ముందుగా పాఠశాలకు సంబంధించిన టెన్త్ విద్యార్థుల ఫీజు మొత్తం ఒకే చలాన్‌లో చెల్లించి రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. ఏజ్ కండిషన్‌కు మాత్రం విడిగా చలాన్ పేమెంట్ చేయాలి. స్టూడెంట్ ఇన్‌ఫో నుంచి చైల్డ్ ఐడీ పొందుపర్చాలి. మిగిలిన డేటా అంతా ఇందులోనే నమోదు చేయాలి. విద్యార్థుల పూర్తి వివరాలను అందులో రాయాలి. ఫొటో సైజ్ కూడా 30 కేబీ నుంచి 40 కేబీ మధ్య ఉండాలి. సంతకం సైజ్ 10 కేబీ నుంచి 20 కేబీ మధ్య ఉండాలి.

విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్న యాజమాన్యాలు..

పదో తరగతి వార్షిక పరీక్షల ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగుస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ప్రస్తుతం ఫీజుల చెల్లింపు హడావిడి నెలకొంది. ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్‌లో యాజమాన్యాలు విద్యార్థుల సమగ్ర వివరాలను నమోదు చేస్తున్నాయి. నామినల్ రోల్స్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన వివరాల హార్డ్‌కాపీలను ఎంఈవోలతో వెరిఫై చేయించి, డీఈవో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.

అసహనం, ఆవేశమే ప్రాణం తీసింది

» లారీ డ్రైవర్‌తో గొడవపడి ఎదురెళ్లి ఆపే ప్రయత్నంలో.. కబళించిన మృత్యువు
» హత్యకేసుగా మారిన రోడ్డు ప్రమాదం.. » పోలీసుల అదుపులో లారీడ్రైవర్


సోమయ్య(ఫైల్)

మధిర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అసహనం.. ఆవేశం.. ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ యువకుడు వెనక నుంచి వస్తున్న లారీ డ్రైవర్‌తో గొడవపడి ఆవేశంతో ఎదురెళ్లి ప్రాణం తీసుకున్నాడు. మధిర మండలం కృష్ణాపురంలో మంగళవారం రాత్రి లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటనపై పోలీసుల దర్యాప్తులో హత్యకేసుగా మారి ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. మధిర రూరల్ ఎస్.ఐ లక్ష్మీభార్గవి తెలిపిన వివరాల ప్రకారం..

కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన కలికపూడి సోమయ్య (32) మంగళవారం సాయంత్రం వైరా మీదుగా బోనకల్ మండలం రావపల్లెలోని బంధువుల ఇంట్లో జరిగే వేడుకకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. గొల్లపూడి సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ డ్రైవర్ సైడ్ కోసం రెండు, మూడుసార్లు హారన్ కొట్టడంతో సోమయ్య లారీని ఆపి లారీ డ్రైవర్‌తో వాదనకు దిగాడు. డ్రైవర్ లారీని ఆపకుండా పోనివ్వడంతో ఆగ్రహానికి గురైన సోమయ్య లారీని వెంబడించి సిరిపురం వద్ద ఆపాడు. ఇద్దరు గొడవపడ్డారు. గొడవ జరుగుతుండగానే లారీ డ్రైవర్ ముందుకు సాగడంతో మళ్లీ ద్విచక్ర వాహనంపై వెంబడించి కృష్ణాపురం వద్ద లారీని ఆపి ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో ఘర్షణపెరిగి లారీ డ్రైవర్ లారీని ముందుకు నడపటంతో సోమయ్యను లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. తొలుత స్థానికులు తెలిపిన వివరాల ఆధారంగా రోడ్డు ప్రమాదంగా కేసు నమోదుచేసిన రూరల్ పోలీసులు మృతుడిని ఢీకొన్న లారీ ఎర్రుపాలెం మండలం ఇనగాలి గ్రామానికి చెందినదిగా గుర్తించి లారీని, డ్రైవర్ దుర్గారావును అదుపులోకి తీసుకొని పలు కోణాల్లో విచారించగా అసలు విషయం వెలుగుచూసింది. దీంతో హత్యకేసుగా నమోదు చేసి సీఐ మధు ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సోమయ్య గతంలో ఓ పత్రికలో విలేకరిగా పనిచేసి, ప్రస్తుతం ఖమ్మంలో ఫిజియోథెరిపిస్టుగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

బ్యాండ్ పోటీల్లో వైరా టీజీఆర్ఎస్ స్టేట్ ఫస్ట్


ట్రోఫీతో విద్యార్థినులు

వైరా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఇంటర్ స్కూల్ బ్యాండ్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. ఈనెల 11న హైదరాబాద్‌లో తెలంగాణ స్టేట్ లెవల్ ఇంటర్ స్కూల్ బ్యాండ్ పోటీలు నిర్వహించారు. వైరా గురుకులం విద్యార్థినులు బ్యాండ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి ప్రథమ బహుమతి పొందారు. ఈ బహుమతి సాధించిన విద్యార్థినులను గురుకుల ప్రిన్సిపాల్ బి.రమ, ఉపాధ్యాయునీలు అభినందించారు..

స్టీల్ షాపు యజమాని ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్ నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన బిజ్జల భాస్కర్ రూ.10లక్షలకు దివాళా పిటీషన్ దాఖలు చేశాడు. ఫిర్యాది దారుడు స్టీల్ వ్యాపారం చేసేవాడు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేసేందుకు బంధువులు, ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక మొత్తంలో అప్పులు చేశాడు. వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావడంతో రుణదాతల నుంచి వత్తిడి తీవ్రం అయింది. దీంతో నలుగురు రుణదాతలను ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో దివాళా పిటీషన్ దాఖలుచేశాడు. తనను దివాళా దారుగా ప్రకటించమని పిటీషన్‌లో కోర్టును అభ్యర్థించాడు.

ప్రజా సంక్షేమానికే ఇంటింటి సర్వే

» కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ


ఇంటింటి సర్వేపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ

ఖమ్మంసంక్షేమ విభాగం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కష్టపడి పని చేస్తోందని, ప్రజల సంక్షేమం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే జరుగుతుందని 44వ డివిజన్ కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ వివరించారు. గురువారం డివిజన్ పరిధిలో ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. స్థానిక ప్రజలకు అవగాహన కల్పిస్తూ సర్వే బృందాలకు సహకరించారు. ప్రజలు ఎటువంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదని

ఎడ్ల పందేలను ప్రారంభించిన రాయల

నేలకొండపల్లి,నవంబరు14(ఆంధ్రజ్యోతి):కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మూడు రోజులుగా రాజేశ్వరపురంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల పందేలు మూడోరోజు రాష్ట్ర గిడ్డంగుల సంస్థచైర్మన్ రాయల నాగేశ్వరరావు ప్రారంభించారు. ప్రతీకార్తీక పౌర్ణమికి జాతీయ స్థాయి ఎడ్లపందాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు దండా ప్రవీణ్‌కుమార్ పందాల్లో ఎడ్లను తోలారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తన్నీరు కృష్ణమూర్తి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, దండా రంగయ్య, జటంగివెంకన్న, బచ్చలకూరి నాగరాజు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీతో హనీవెల్ ఒప్పందం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అంతర్జాతీయ సంస్థ హనీవెల్‌తో ఎస్‌బీఐటీ కళాశాల అవగాహనా ఒప్పందం కుదుర్చుకుందని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. హైదరాబాదులో గురువారం నిర్వహించిన బ్రిడ్జ్ సదస్సులో ఒప్పంద ప్రతాన్ని అందుకున్నారు.

24న నెలనెల వెన్నెల

ఖమ్మంసాంస్కృతికం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల24న సాయంత్రం చిగురు మేఘం నాటిక ప్రదర్శించబడుతుందని నెల నెల వెన్నెల నిర్వాహకులు ఎఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళా ఉద్యోగులకు సౌకర్యాలు

కేఎంసీలో ప్రత్యేక హాల్‌ను ప్రారంభించిన మేయర్ నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు14 (ఆంధ్రజ్యోతి): మహిళల సౌకర్యం కోసం నగర పాలక సంస్థలో ప్రత్యేకంగా హాల్‌ను ఏర్పాటు చేయగా, గురువారం దీన్ని మేయర్ పునుకొళ్ల నీరజ ప్రారంభించారు. మహిళా ఉద్యోగుల్లో కొంతమంది చంటి పిల్లలతో ఇబ్బంది పడుతున్నారని, మధ్యాహ్న భోజనం చేసేందుకు, విరామ సమయంలో సేదతీరుతూ ఆటలు ఆడుకునేందుకు హాల్‌లో ఏర్పాట్లు చేశామని తెలిపారు. మహిళా ఉద్యోగులతో కలిసి పలు ఆటలు ఆడారు. సహాయ కమిషనర్ ఆహ్మద్ షఫి ఉల్లా, ఏసీపీ వసుంధర, ఉద్యాన అధికారిణి బెల్లం రాధిక, డీఈ మాధవి, ఆర్‌ఐ జ్యోతి, హాసిని మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

48వ డివిజన్‌లో నేను నా ఖమ్మం

నేను నా ఖమ్మం కార్యక్రమంలో భాగంగా 48వ డివిజన్‌లో వనమహోత్సవం మొక్కలను మేయర్ నీరజ నాటారు. బాలల దినోత్సవం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ తోట గోవిందమ్మ, సహాయ కమిషనర్ ఆహ్మద్ షఫి ఉల్లా, తోట రామారావు, ఉద్యాన అధికారి బెల్లం రాధిక పాల్గొన్నారు. 18వ డివిజన్‌లో అమృత మిత్ర పథకం ద్వారా నిర్మాణం జరిగిన తాగునీటి కుళాయిలను మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ట్యాప్‌ల నిర్వాహణ బాధ్యలను మెప్మా మహిళ సంఘాలకు అప్పగించటం జరిగిందన్నారు. మెప్మా టీపీఎంసీ సుజాత, సీవోలు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బాల సదనంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖాన్ కేక్ కట్ చేశారు. నగరంలోని పోలీసుపరేడ్ గ్రౌండ్‌లో ఉన్న శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో స్కూల్‌చైర్‌పర్సన్, సీపీ సతీమణి నిషితాశర్మ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో దేశనాయకుల వేషధారణలో చిన్నారులు అలరించారు. వివిధ విద్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. నెట్‌వర్క్


హార్వెస్ట్ పాఠశాలలో విద్యార్థుల వేషధారణలు



న్యూవిజన్‌లో..


శ్రీచైతన్యలో..



న్యూఇరాలో...


సర్వజ్ఞలో..


త్రివేణిలో..


స్మార్ట్‌కిడ్జ్‌లో..



రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీలో


గీతాంజలి పాఠశాలలో..



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సీపీ సతీమణి నిషితాశర్మ

దళారులకు అడ్డాగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు

● తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్

తల్లాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దళారులకు అడ్డాగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అన్నారు. గురువారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవనంలో కల్యాణపు కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన రైతుసంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లుగా పత్తి రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుసంఘం జిల్లా నాయకులు తాతా భాస్కర్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, నల్ల మోతు మోహన్‌రావు, ఐనాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, సత్తెనపల్లి నరేష్ పాల్గొన్నారు.

పశుగణనను సమర్థవంతంగా చేపట్టాలి

తహసీల్దార్ రాంబాబు

మధిరటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని మండలంలో సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ రాంబాబు కోరారు. గురువారం మధిర తహసీల్దార్ కార్యాలయంలో 21వ అఖిల భారత పశుగణన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ పండరి, పశు వైద్యాధికారి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూర్‌లో వైద్య శిబిరం

ఏన్కూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాలయంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులను అందించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ తుడి శ్రీనివాసరెడ్డి, సీహెచ్‌వో శివరాజు, హెల్త్ ఎడ్యుకేషన్ కేటర్ వేణుగోపాల్, హెల్త్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, హెచ్‌ఈ పుష్పారాణి, ఏఎన్‌ంలు జయకుఏమారి, తాటి రమణ, స్టాఫ్‌నర్సు శారా స్వప్న పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

ముదిగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పమ్మి ప్రాథమిక పాఠశాలలో కందుల అప్పారావు జ్ఞాపకార్థం అతని కుమారులు నాగేశ్వరరావు, రామకృష్ణలు 70మంది విద్యార్థులకు ప్రతి విద్యార్థికి రూ.వెయ్యి విలువ చేసే బ్యాగ్, నోట్, డ్రా యింగ్ పుస్తకాలు, తదితర సామగ్రిని గురువారం ఎంఈవో రమణయ్య చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీకే.ప్రసాద్, సురేష్, షర్మిళ, రమణారెడ్డి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

'కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి'

బోనకల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణన సర్వేను సమర్దవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్యలు సూచించారు. మండలంలోని గోవిందాపురం(ఎల్), లక్ష్మీపురం గ్రామాల్లో గురువారం వారు సమగ్ర సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇళ్ల వద్ద ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వే తీరును పర్యవేక్షించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఫార్మట్లల్లో ఇచ్చిన ప్రతి ప్రశ్నావళిని అడిగి ప్రజలు ఇచ్చే సమాధానాలను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

సత్తుపల్లిరూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : భారతదేశానికి స్వాతంత్రం కోసం చేసిన పోరాటంలో మాజీ ప్రధాని జవహర్ లాల్‌నెహ్రూ కీలకప్రాత పోషించారని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరులోని కళాశాల ఆవరణలో నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ జాకీర్‌హుస్సేన్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎంవీ.రామచంద్రరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కే.రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

మధిర, నవంబరు14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని గురువారం మధిరలో నిర్వహించారు. భరత్ విద్యాసంస్థల్లో చిన్నారులు వివిధ వేషధారణల్లో అలరించారు. విద్యాసంస్థల డైరెక్టర్ శీలం వెంకటరెడ్డి, కరస్పాండెంట్ విద్యాలత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మర్లపాడు జిల్లా పరిషత్, ఖమ్మంపాడు యూపీఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.

ఎర్రుపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎర్రుపాలెం జిల్లపరిషత్ పాఠశాలలో మాడపాటి రామచంద్రరావు కుమార్తె మాడపాటి సరోజిని ఆధ్వర్యంలో మాడపాటి చేయూత కార్యక్రమం ద్వారా విద్యార్థులకు రూ.2000 ఆర్థిక చేయూతనందించారు. ఈకార్యక్రమంలో స్వాతంత్ర సమరయోధుడు జమలాపురపు గోపాలకిషన్ చిన్నకృష్ణయ్య, దండెం సత్యనారాయణరెడ్డి, హెచ్‌ఎం జీవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు

బోనకల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

చింతకాని, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.

మధిరటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని గురువారం మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు దుంపా వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్లు మల్లాది వాసు, కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, మధార్ తదితరులున్నారు.



మర్లపాడు పాఠశాలలో స్వపరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు



రేమిడిచర్ల పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



ఖమ్మంపాడు యూపీఎస్ పాఠశాలలో స్వపరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు



మధిరలో భరత్ విద్యాసంస్థల పాఠశాలలో స్వపరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు



చింతకానిలో శ్రీఆదర్శ పాఠశాలలో..

బొగ్గు నాణ్యత వారోత్సవాలు

సత్తుపల్లిరూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): బొగ్గు నాణ్యతా వారోత్సవాలను గురువారం నుంచి మండలంలోని కిష్టారం ఓసీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో ఎంవీ.నరసింహారావు మాట్లాడుతూ ఏ సంస్థకైనా దాని మనుగడ, పురోభివృద్ధికి ఆ సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకతలతో పాటు ఉత్పత్తి అయిన వస్తు నాణ్యతపై ఆధారపడి ఉంటుందన్నారు కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మేనేజర్ వీ.బాబు, ఇంజనీర్ వీరప్రసాద్, క్వాలిటీ ఇన్‌చార్జి ఫజల్, రక్షణ అధికారి గోపి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

బండి రత్నాకర్ వర్ధంతి

చింతకాని, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చింతకాని టీడీపీ సీనియర్ నాయకుడు దివంగత బండి రత్నాకర్ 19వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం గ్రామంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మంకెన రమేష్, గురిజాల హనుమంతరావు, నన్నక గోపాలరావు, పొనుగోటి రత్నాకర్, జానిమియా, సతీష్ పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి వెళ్లాలి: ఎస్ఐ

సత్తుపల్లిరూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు వెళ్లాలని సత్తుపల్లి ఎస్ఐ రఘు ఆకాంక్షించారు. స్థానిక శ్రీ నారాయణ జూనియర్ కళాశాలలో జేఈఈ మెయిన్స్, నీట్ ఎంసెట్‌లకు ప్రతి నెలా నిర్వహించే పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మొదటి సంవత్సరం ఇంటర్ ఫలితాలలో ఎంపీసీ విభాగంలో 468/470 మార్కులు సాధించిన ఎన్‌సీహెచ్.శ్రీసఖ వరుణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ రామకృష్ణమాచార్య కరస్పాండెంట్ వనమారెడ్డి మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, డీ.కృష్ణారెడ్డి, రాజశేఖర్. నవకుమార్, నరేంద్రమోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వరుణ్‌ను అభినందిస్తున్న ఎస్ఐ రఘు

అందరికీ న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులకు అందరికీ న్యాయం జరుగుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకముందు సత్తుపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ కాలనీలో మాజీ ప్రధాని జవహర్ లాల్ నేహ్రూ జయంతి సందర్భంగా నేను-నా సత్తుపల్లి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త బకెట్లను ప్రజలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు, ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, హెచ్‌ఎం నీరుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెత్త బకెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

● వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, నవంబరు14(ఆంధ్రజ్యోతి): గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరాలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో గత నాలుగురోజులుగా నిర్వహించిన భద్రాద్రి జోన్‌స్థాయి పదోవ జోనల్ క్రీడలు గురువారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైరా గురుకులం ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సమత, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, కమిషనర్ చింతా వేణు, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, వైరా, కొణిజర్ల మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, ఏదునూరి సీతరాములు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ బీడీ కే.రత్నం, నంబూరి కనకదుర్గా, సీఐ, ఎస్ఐ ఎన్. సాగర్, వంశీకృష్ణ భాగ్యరాజ్ తదితరులున్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

నేను- నా మధిర కార్యక్రమం ప్రారంభం

మధిరటౌన్,నవంబరు14(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా ఉంచేందుకే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు క్లీన్ అండ్ గ్రీన్ లక్ష్యంగా నేను నా మధిర కార్యక్రమం చేపట్టడం జరిగిందని మధిర మునిసిపల్ ఛైర్‌పర్సన్ మొండితోక లత, కమిషనర్ సంపత్ కుమార్ తెలిపారు. గురువారం మధిర పట్టణంలోని 20వ వార్డు లో నేను నా మధిర కార్యక్రమం ప్రారంభం సందర్భంగా తడి, పొడి బుట్టలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగా హనుమంతరావు, కౌన్సిలర్లు, మల్లాది వాసు, కోనా ధనికుమార్, మునుగొటి వెంకటేశ్వర్లు, పారుపల్లి విజయ్, అనిల్ కుమార్ నెహ్రూ, రంగా శ్రీను, కర్నాటి రామారావు, అద్దంకి రవి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతితో అధిక లాభాలు

» జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య

ఏన్కూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం ఎంతో మేలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య అన్నారు. గురువారం మండలంలోని తిమ్మరావుపేట గ్రామంలో పత్తి, వరి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఏ.నరసింహారావు, ఏఈవోలు బాలకృష్ణ, శ్రీకాంత్, రైతులు సత్యం, గణేష్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి సర్వే అడ్డగింత

చింతకాని, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొదుమూరు సమీపంలో నాగ్‌పూర్-అమరావతి జాతీయ రహదారి సర్వేను గురువారం పలువురు రైతులు అడ్డుకున్నారు. సర్వే అధికారులు బావులు, చెరువులు, బోర్లు లెక్కింపు సర్వేను చేపట్టారు. ఈ సర్వేను కొంత మంది రైతులు అడ్డుకున్నారు. తమకు పూర్తి స్థాయి పరిహారం ఇచ్చిన తరువాతే సర్వేను కొనసాగించాలని రైతులు పట్టుబట్టడంతో సర్వే అధికారులు వెనక్కుతగ్గినట్లు సమాచారం.

చింతకానిలో ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

చింతకాని, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి కళావతీబాయి గురువారం తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో ఉపకేంద్రంలో జరుగుతున్న గ్రామ ఆరోగ్య పారిశుధ్య కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పోషకాహారం వలన కలుగు ప్రయోజనాలు పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్గించారు. ఈ సంధర్బంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాస్‌మీడియా అధికారి సాంబశివారెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్, ఆరోగ్య ఉపకేంద్రం వైద్యుడు వీవీ రావు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'జీపీ వర్కర్లకు వేతన బకాయిలు ఇవ్వాలి'

కారేపల్లి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండలంలో 41గ్రామపంచాయతీలలో వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతానాలను ఇప్పించాలని కోరుతూ గురువారం పలువురు పంచాయతీ వర్కర్లు జిల్లా కలెక్టర్ ముజుమ్మిల్‌ఖాన్ ను కలిసి వినతిపత్రం అందచేవారు. గత కొన్ని నెలలుగా వేతానాలు రావడం లేదని వాపోయారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ఈవిషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసి వేతానాలు వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మిత్రబృందం

బోనకల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామానికి చెందిన వేమా గురుమూర్తి గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పేదరిక కుటుంబం కావడంతో అతని మిత్ర బృందం తెల్లబోయిన సుమన్, చాపల మడుగు కోటేశ్వరరావు, గరపాకుల చంద్రశేఖర్, గర్నెపుడి దాసు, మన్నేపల్లి జ్యోతి రూ. 23,500 నగదు సాయాన్ని గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. తమ వంతుగా చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి సాయం అందించామని వారు తెలిపారు.

'తోపుడు బండి' సాధిక్ సేవలు ఆదర్శనీయం

కల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : 'తోపుడు బండి' సాధిక్ సేవలు నేటి తరానికి ఆదర్శనీయమని పలువురు ప్రముఖులు అన్నారు. గురువారం కల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తొపుడుబండి సాధిక్ అలీ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు రాజకీయ నాయకులు సాధిక్‌అలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, మండల విద్యాధికారి నివేదిత, స్నేహ స్వచ్ఛంద సంస్థ అధినేత ఫయాజ్‌లు ప్రసంగిస్తూ సామాజిక సేవలో సాధిక్ ఆశయం ఎంతో గొప్పదన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సాధిక్ సతీమణి ఉషా దయాళ్ మాట్లాడుతూ సాధిక్ ఆశయాలను, తొపుడు సేవలను కొనసాగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు తొపుడుబండి, స్పూర్తి ఫౌండేషన్ తరుపున షట్టర్స్, ఐడి కార్డులు, టీఫిన్ బాక్స్‌లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు దయాల కిషోర్‌దత్, సుజాత, ఉమా, శ్యామాల, మండల కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన దుర్గాప్రసాద్, మాదిరాజు లక్ష్మణరావు, బైర్ల కాంతరావు, హెచ్‌ఎంలు వాసిరెడ్డి పద్మ, పి. పద్మ, ఉపాధ్యాయులు వర్మా రామారావు, విజయ్‌కుమార్ తదితరులున్నారు.



సాధిక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

నేడు మధిరలో డయల్ యువర్ డీఎం

మధిర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధిర ఆర్టీసీ డిపోలో ఈనెల 15వతేదీ శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్, వైరా, తల్లాడ మండలాల ప్రయాణీకులు ఈసదుపాయం వినియోగించుకోవాలని కోరారు. 99592 25961 నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



మాట్లాడుతున్న సొసైటీ ఛైర్మన్ యలగొండస్వామి

ముదిగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ తుపాకుల యలగొండస్వామి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ బట్టు పురుషోత్తం, సీఈవో వెంకటరత్నం, డైరెక్టర్లు వనం ప్రదీప్త, రాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

సత్తుపల్లిరూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌డీవీఆర్ జడ్పీఎస్‌ఎస్ బీ.గంగారం ప్రభుత్వ పాఠశాలకు వాగ్దేవి పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రూ.10వేల విలువైన బహుమతులను అందజేశారు. స్వయం పరిపాలనా దినోత్సవం సందర్భంగా క్విజ్, వ్యాసరచన, వకృత్వ పోటీలలో గెలిపొందిన విద్యార్థులకు డిక్షనరీలు, జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన పుస్తకాలను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. ఎం.జయరాజు, పూర్వ విద్యార్థులు బాల నాగేశ్వరరావు, గణపవరపు సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

తల్లాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం రామానుజవరం గ్రామానికి చెందిన బాధిత రైతు యన్నం శ్రీనివాసరెడ్డికి గురువారం రూ.1.20లక్షల బీమా పరిహారం చెక్కును ఎన్‌పీడీసీఎల్ తల్లాడ ఏడీఈ సతీష్ అందజేశారు. గత ఏడాది మేనెలలో విద్యుదాఘాతంతో శీనివాసరెడ్డికి చెందిన మూడు పాడిగేదెలు మృతి చెందాయి. దీంతో పరిహారంగా మంజూరైన రూ.1.20లక్షల బీమా చెక్కును అందజేశారు.

ఆర్థిక సహాయం అందజేత

కల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగాల గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన కోలేటి శివ కుటుంబానికి మాజీ సర్పంచ్ దేవర పల్లి నాగప్రసాద్, అరుణ దంపతుల కుమారుడు పట్టాభి రూ. 10 వేలు వితరణ చేశారు. గురువారం లింగాలలో ఆ నగదును మాజీ ఎంపీటీసీ వేము కృష్ణ చేతుల మీదగా శివ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ సభ్యులు నాని, సంజీవరావు, యేసు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద వాహనాల క్యూ

» కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో రాజేంద్రగౌడ్

తల్లాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని సీసీఐ కొనుగోలు కేంద్రంలో రైతులు పత్తిని విక్రయించేందుకు వాహనాలతో క్యూకట్టారు. గురువారం ఉదయం నుంచి సీసీఐ కొనుగోలు కేంద్రానికి రైతులు పత్తిని వాహనాలతో తరలించారు. అధిక సంఖ్యలో వచ్చిన వాహనాలు తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారి వెంట బారులు తీరాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ సందర్శించి పత్తి కొనుగోలుకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీసీఐ నిబంధనల మేరకు నాణ్యమైన పత్తిని అమ్మి మద్దతు ధర పొందాలని రైతులకు ఆయన సూచించారు. సుమారు 800క్వింటాళ్ల మేరకు పత్తిని కొనుగోలు చేసినట్లు ఏఎంసీ అసిస్టెంట్ సెక్రటరీ వి.వెంకటేశ్వర్లు తెలిపారు.



తల్లాడ సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద బారులు తీరిన వాహనాలు

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

» ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం

మధిర, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని తెలంగాణలో అధికారంలోకి తీసుకొచ్చేవరకు ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని ఆపార్టీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం కోరారు. గురువారం మధిర 11వార్డులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడా రు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చేకూరి శేఖర్‌బాబు, మల్లాది హనుమంతరావు, గద్దల ప్రకాశరావు, గట్టిగుండె జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

మధిరటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం ముమ్మరంగా కొనసాగింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు, చేకూరి శేఖర్‌బాబు, కృష్ణారావు, సునీల్, వెంకటేశ్వరావు, రవి పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామనాథం

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి: సీపీఎం

వైరా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని, రెండు పంటలకు రైతుభరోసా ఇవ్వాలని లేనట్లయితే ప్రజా ఉద్యమాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని లింగన్నపాలెం గ్రామంలో గురువారం కిలారు శ్రీనివాసరావు, మాగంటి తిరుమలరావు, గాలి అరుణ అధ్యక్షవర్గంగా జరిగిన సీపీఎం మండల మహాసభలో నున్నా ప్రసంగించారు. లింగన్నపాలెం మాజీ సర్పంచ్ తోటకూర రామయ్య సీపీఎం జెండా ఎగురవేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి బాజాల శ్రీనివాసరావు సహా 18మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొంతు సమత, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, చింతల చెర్వు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, మేరుగు సత్యనారాయణ, పారుపల్లి ఝాన్సీ, దొండపాటి నాగేశ్వరరావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

● అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంతకుమార్

తల్లాడ, నవంబరు14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థినులు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జె.హేమంతకుమార్ సూచించారు. గురువారం తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని సత్తుపల్లి ఏడీఏ వి.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సులో హేమంతకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వ్యవసాయ స్థితిగతులను రైతులతో కలిసి అధ్యయనం చేయడం వల్ల విద్యార్థులు భవిష్యత్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తలుగా రాణిస్తారని పేర్కొన్నారు.

అనంతరం వ్యవసాయానికి సంబంధించిన వివిధ మోడల్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ జెస్సీ సునీత, పణిశ్రీ, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ టి.ఝాన్సీరాణి, డాక్టర్ కె.శిరీష తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రానికి మూడు రోజులు సెలవులు

కారేపల్లి నవంబరు14:(ఆంధ్రజ్యోతి)కారేపల్లి మండల కేంద్రంలోని సీసీఐ కేంద్రానికి నేటి నుంచి మూడురోజులు సెలవులు ఉన్నాయని ఇల్లెందు వ్యవసాయ కమిటి ఛైర్మన్ బి.రాంబాబు తెలిపారు. ఈనెల18సోమవారం నుంచి సీసీఐ కేంద్రంలో యథావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయని తెలిపారు.

గ్రూప్-4కు ఎంపికైన కానిస్టేబుల్

వైరా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైరాలోని బ్రాహ్మణపల్లి అగ్రహారానికి చెందిన సివిల్ కానిస్టేబుల్ షేక్.అజీజ్ అహ్మద్ గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికయ్యారు. గురువారం విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో అజీజ్ అహ్మద్‌ను రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వరించింది. ఏడాది వ్యవధిలో అజీజ్ అహ్మద్ సివిల్ పోలీస్ కానిస్టేబుల్, గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. అజీజ్ అహ్మద్ తండ్రి బాబూజానీ వైరా ఏసీపీ కార్యాలయంలో రైటర్‌గా పనిచేస్తున్నారు. అజీజ్ అహ్మద్‌ను ఏసీపీ ఎం.ఎ.రెహ్మాన్‌తో పలువురు అభినందించారు.